
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
ఆదివారం 31 మార్చి 2024



నీరు లేక ఎండుతున్న పొలాలు

● పశువులకు మేతగా మారుతున్న వైనం ● ఎండిన వరద కాలువ



లక్ష్మీదేవిపల్లిలో ఎండిన వరి పొలంలో పశువులు

గంగాధర,మార్చి 30: మెట్ట ప్రాంత రైతు సాగు చేసిన పంటలకు నీరు లేక ఎండలకు మాడుతున్నాయి. చేతి కొచ్చే దశలో వరిపంట నీరందక నేల నెర్రలు బారుతోంది. ఎంతో ఆశతో సాగు చేసిన పంట కళ్ల ముందే ఎండుతుండటంతో రైతు కంట నీరుపెడుతున్నారు. గంగాధర మండలంలో యాసంగిలో 19వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మెట్ట ప్రాంతమైన మండలంలో బావులు, బోర్లతో ఎక్కువగా సాగు చేస్తుంటారు. నారాయణపూర్ రిజర్వాయర్ ఎడమ కాలువ కింద కొండయ్యపల్లి, చర్లపల్లి(ఎన్), నాగిరెడ్డిపూర్, లక్ష్మీదేవిపల్లి,చర్లపల్లి(ఆర్), నారాయణపూర్ గ్రామాల్లో వరిసాగు చేస్తారు. వరద కాలువను ఆనుకొని ఉన్న ర్యాలపల్లి, బూరుగుపల్లి, కొండయ్యపల్లి, నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, ఆచంపల్లి, గట్టుబూత్కూర్ గ్రామాల రైతులు వరిసాగు చేశారు. అయితే ఈసారి కాళేశ్వరంలో నీరు లేకపోవడంతో వరద కాలువకు నీరు విడుదల చేయలేదు. ఫిబ్రవరి చివరి వరకు కాలువలోని నీరుతో పంటలకు నీరందించారు. మార్చి నుంచి ఎండలు ముదరడం, వరి పొట్టదశలో నీరు ఎక్కువ అవసరముండటంతో కాలువలోని ఉన్న నీరంతా ఖాళీ అయింది. నాగిరెడ్డిపూర్ నుంచి ఆచంపల్లి వరకు వరద కాలువలో చుక్క నీరులేకపోవడంతో రైతులు ధర్నాకు ప్రయత్నించగా మల్యాల వద్ద గేట్లు ఎత్తి ఉన్న నీటిని దిగువకు వదిలారు. మూడురోజులు వరకు సరిపోగా ప్రస్తుతం నీటి కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. గింజ గట్టిపడే సమయంలో నీరందకపోతే తాలుగా మారి చేతికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. రిజర్వాయర్ ఎడమకాలువకు నీరు విడుదల చేయడంతో రైతులకు కొంతఊరట లభించింది. బోర్లు, బావు కింద సాగు చేసిన పొలాలు ఎండలకు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పంటలను పశువులకు మేతగా ఉపయోగిస్తున్నారు. ఈ యాసంగిలో చీడపీడలు, రోగాలకు పెట్టుబడి ఎకరాకు 30 వేలు మీదపడి అప్పుల పాలవడం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు



- నిన్న 'ఆరెపల్లి', నేడు 'కోడూరి'
- త్వరలో పలువురు కార్పొరేటర్లు చేరే అవకాశం
- ఇద్దరు శాసనసభ్యుల చేరికపై చర్చ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్‌లోకి వలసలు ఊపందుకున్నాయి. రోజుకో నాయకుడు కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆ పార్టీలో కొత్త ఉత్సాహం రేకెత్తుతుండగా బీఆర్ఎస్ డీలా పడుతున్నది. గత ఎన్నికల ముందు ఒకరిద్దరు నాయకులు మాత్రమే కాంగ్రెస్ పార్టీలో చేరినా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీలోకి రావలసిందిగా వివిధ పార్టీల వారిని ఆహ్వానించడంతో వలసలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మానకొండూర్ మాజీ శాసనసభ్యుడు, బీజేపీ నాయకుడు ఆరెపల్లి మోహన్ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం తీసుకోగా శనివారం మరో సీనియర్ నాయకుడు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన చొప్పదండి మాజీ శాసనసభ్యుడు కోడూరి సత్యనారాయణగౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డికి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం తీసుకున్నారు. బీజేపీకి చెందిన మరో మాజీ శాసనసభ్యుడు కటకం మృత్యుంజయం కూడా ఎన్నికల సందర్భంగానే బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరారు. చిగురుమామిడి జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ హస్తం గూటికి చేరగా, ఇటీవల కొత్తపల్లి, కరీంనగర్ జడ్పీటీసీలు పిట్టల వినోద రవీందర్, పురమల్ల లలిత శ్రీనివాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి వారి భర్తలతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కరీంనగర్ పట్టణానికి చెందిన పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడ్డారు. అయితే ఆ పార్టీ జిల్లా నాయకుల నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం వారు ఎదురు చూస్తున్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే అన్ని పార్టీల నుంచి వచ్చే నాయకులను చేర్చుకోవడానికి అనుమతి ఇవ్వడంతో త్వరలోనే దాదాపు 10 మంది కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశమున్నది. జిల్లాలోని ఇద్దరు సిట్టింగ్ శాసనసభ్యులు కాంగ్రెస్‌లో చేరుతారంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్, బీజేపీల నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతుండడంతో పార్లమెంట్ ఎన్నికలు ముందు జరుగు తున్న ఈ పరిణామాలు ఆయా పార్టీలో కలకలం సృష్టిస్తున్నాయి. అలాగే పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీ టీసీలు కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవు తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణ ఉద్యమ సమ యంలో, ఆ తర్వాత వివిధ పార్టీలోకి చేరిన సీనియర్ ద్వితీయశ్రేణి నాయకులు, గ్రామ, మండల, పట్టణ స్థాయి నాయకులు కూడా తిరిగి స్వంత గూటికి చేరాలని ఆలోచిస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ జరుగు తోంది. కరీంనగర్ పార్లమెంట్ నుంచి పోటీచేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేరు ప్రకటిస్తే ఆ పార్టీలో పెద్ద సంఖ్యలో చేరుతారని చెబుతున్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

- హాస్టళ్లు, అద్దెగదులు ఖాళీ
- సహ విద్యార్థులకు వీడ్కోలు
- ఆఖరిరోజు 33 మంది గైర్హాజరు



పరీక్షలు ముగియడంతో హుషారుగా విద్యార్థులు

కరీంనగర్ టౌన్, మార్చి 30: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆఖరిరోజు శనివారం నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 12,565 మంది రెగ్యులర్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా 14 మంది గైర్హాజరు కాగా 12,548 పరీక్ష రాశారు. అలాగే 34 మంది ప్రైవేట్ విద్యార్థుల్లో 15 మంది పరీక్షలు రాయగా 19 మంది గైర్హాజరయ్యారు.



లగేజీలతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

జిల్లాలో 77 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 24 పరీక్షా కేంద్రాలను ప్రత్యేక అధికారుల బృందం, నాలుగు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, వైద్యశాఖల అధికారుల సహకారంతో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఒకరికొకరు సహ విద్యార్థులకు వీడ్కోలు చెబుతూ స్వంత ఊళ్లకు బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలో పదోతరగతి చదివిన విద్యార్థులు హాస్టళ్లు, అద్దెగదులను ఖాళీ చేసి కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా వారి ఇళ్లకు బయలు దేరారు. ఆర్టీసీ ప్రయాణప్రాంగణం విద్యార్థులతో కిటకిటలాడింది.

దేశంలో అవినీతిపాలన

- కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసుల వెనుక బీజేపీ కుట్ర
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

గణేశ్‌నగర్, మార్చి 30: నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో అవినీతి పరిపాలన సాగుతోందని, కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసుల వెనుక బీజేపీ కుట్ర ఉందని డీసీసీ ఆధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ రూ:1,823 కోట్లు చెల్లించాలంటూ ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు రావడం తమ పార్టీని ఆర్థికంగా కుంగదీసేందుకు బీజేపీ చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఐటీ నోటీసులపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్త నిరసనలో భాగంగా శనివారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాచౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో వేల కోట్ల రూపాయలు స్వీకరించిన బీజేపీ వాటికి బదులుగా క్విడ్ ప్రోకో పద్ధతిలో ఆ సంస్థలకు లాభం చేకూర్చిందన్నారు. అవినీతిని అంతమొందిస్తామని, నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతిపేద వాడి అకౌంట్లో 15 లక్షల రూపాయలు జమచేస్తామని, ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంచుతామని ఎన్నికల వాగ్దానాలు చేసిన బీజేపీ దానికి వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజల దృష్టి మరల్చడానికి రామజపం చేయడం, గుళ్లు, మసీదులు అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రజల మధ్య ఉన్న ఐకమత్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రసంగాలు చేస్తూ తమను ప్రశ్నించిన వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐల ద్వారా దాడులు చేయించి వారిని లొంగదీసుకోవడం బీజేపీ పాలనలో ఒక భాగం అయిందన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడోయాత్ర, న్యాయ్‌యాత్రతో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని కుట్ర పన్నారన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చర్ల పద్మ, రహమతు హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మునిగంటి అనిల్ శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్‌కుమార్, మడుపు మోహన్, తాళ్లపల్లి సంపత్ గౌడ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలి

- మే 3 నుంచి 8వరకు బ్యాలెట్ ఓట్లను స్వీకరించాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల విధులతో పాటు పోలింగ్ రోజున అత్యవసర సేవలందించే అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యంపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. వీరికోసం ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద తప్పనిసరిగా ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆయా రాజకీయ పార్టీలు ఆడియో, వీడియో పాటలు, ప్రచారానికి సంబంధించి ఖచ్చితంగా ఎంసీఎంసి అనుమతి పొందాలని సూచించారు. పోలింగ్ రోజు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది పేరు, ఎంప్లాయ్‌కోడ్, హోదా, మొబైల్ నెంబర్, ఓటరు వివరాలు, అసెంబ్లీ సెగ్మెంట్ వివరాలు, ఓటరు జాబితా సీరియల్‌నెంబర్, గుర్తింపు కార్డు నెంబర్ వివరాలను రూపొందించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గం హెడ్‌కార్వర్టర్‌లో మే 3న పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను స్వీకరించాలని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి ఫారమ్ 12 సమర్పించి, తమ ఓటు హక్కును పొందవచ్చని సూచించారు. 85 సంవత్సరాలపై బడి పూర్తిగా నడవలేని సీనియర్ సిటిజన్లకు, నడవలేని దివ్యాంగులకు, కొవిడ్ రోగులకు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ అమలు చేస్తుందని అన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే వారు ఏప్రిల్ 23లోపు ఫారం-12 బి సమర్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంలో కొత్తపల్లికి ప్రథమ ర్యాంకు

- కరీంనగర్ రూరల్ మండలానికి పదో స్థానం
- వందశాతం పనిదినాలతో రాష్ట్రస్థాయి ర్యాంకులు

కరీంనగర్‌రూరల్; మార్చి 30: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో కొత్తపల్లి మండలానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు వచ్చింది. రాష్ట్రస్థాయిలో 2024 సంవత్సరానికి మార్చి 28 నాటికి ఉపాధి హామీ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా కొత్తపల్లి మండలానికి మొదటి స్థానం లభించగా, కరీంనగర్ రూరల్ మండలానికి పదవ స్థానం లభించింది. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలు వందకు వంద శాతం పనిదినాలు సాధించాయి. 272 రూపాయలకు సరాసరి కొత్తపల్లి మండలంలో 231.64 రూపాయలు, కరీంనగర్ రూరల్ మండలంలో 220.95 రూపాయల సరాసరితో ఉపాధిహామీలో రెండు మండలాలు రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచాయి.

● మాజీ మంత్రి అభినందన

కొత్తపల్లి మండలానికి రాష్ట్రస్థాయిలో ఉపాధి హామీ పథకంలో ప్రథమ ర్యాంకు సాధించడం పట్ల ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ఉపాధి హామీ కూలీలకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 ఆదివారం
సహర్ 4:41 సోమవారం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 30: డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ వృత్తి విద్యా కళాశాలలను చంపేద్దామనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మూడు ఏళ్లగా7,800 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయ న్నారు. డిగ్రీ, పీజీ కళాశాలకు 750 కోట్లు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చినా డబ్బులెందుకు ఇవ్వలేదన్నారు. రేపటితో టోకెన్ల గడువు ముగుస్తుందని ఆ కళాశాలల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇచ్చిన టోకెన్లకు డబ్బులు మంజూ రు చేయాలన్నారు. రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ వృత్తి విద్యా కళాశాలల పరిస్థితి దుర్భరంగా మారింద న్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయలేదన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వందరోజులైనా నిధులు విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయమై జోక్యం చేసుకుని నిధులు విడుదల చేయాలన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విషయంలో మరింత మెరుగైన విధానాన్ని అమలు చేయాలని బీజేపీ పక్షాన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 30: జిల్లాలోని రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా వ్యవహరిస్తూ సహాయ సహకారాలను అందిస్తామని జిల్లా కలెక్టర్ పమేలాల సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం రబీ కొనుగోళ్లపై మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, ఇకపై కూడా అదే విధంగా కొనుగోళ్లు సజావుగా జరిగేందుకు మిల్లర్లు సహకరించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో ఖచ్చితంగా ఎఫ్ఎక్యూ ప్రమాణాలు పాటించాలని అన్నారు. కాప్రా పురుగు వల్ల మిల్లర్లు ఎదుర్కొనే సమస్యలపై ఎఫ్‌సిఐ అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని, అదే విధంగా హమాలి, ట్రాన్స్‌పోర్టు తదితర ఇబ్బందులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రబీలో బాయిల్డ్ రైస్ మాత్రమే చేసేందుకు మిల్లర్లు ముందుకు రావడంతో వారి నుంచి వినతిపత్రం తీసుకున్న కలెక్టర్ దానిని ఉన్నతాధికారులకు పంపిస్తానని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, డిఎస్‌వో గౌరిశంకర్, పౌరసరఫరాల అధికారి రజనీకాంత్, ఏఎస్‌వో సురేశ్, రైసుమిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మానసిక వైద్యుల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 30: భారత మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర సదస్సును నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ మానసిక వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భాగ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానసిక సమస్యలపై పరిశోధనల ఆవశ్యకత, మానసిక సమస్యలను ఎలా పసిగట్టాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం ప్రతిమ మల్టీప్లెక్స్‌లో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ కెకె లక్ష్మన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిషన్, ప్రధానకార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎన్‌డి సంజయ్‌కుమార్, కోశాధికారి డాక్టర్ పి సాయికృష్ణ, డాక్టర్ కె పవన్, డాక్టర్ బి పురుషోత్తం, డాక్టర్ జి ప్రీతి, డాక్టర్ ఎల్ వర్షి, డాక్టర్ ఎం పృథ్వీ, డాక్టర్ ఎన్ రవికుమార్ పాల్గొన్నారు.

బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడిన దివ్యాంగుడు

శంకరపట్నం, మార్చి 30: శంకరపట్నం మండలం కొత్తగట్టులో బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని దివ్యాంగుడు కాపాడాడు. గ్రామానికి చెందిన గడ్డం మల్లమ్మ అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకింది. ఆ సమీయంలో పని చేసుకుంటున్న బండారి రవీందర్ అనే దివ్యాంగుడు గమనించాడు. వెంటనే తను బావి వద్దకు చేరుకొని ధైర్యం చేసి బావిలోకి దూకి వృద్ధురాలిని నీటిపైకి తీసుకువచ్చాడు. సుమారు 20నిమిషాల పాటు మోటర్ బెల్ట్ పట్టుకొని వృద్ధురాలు నీటిలో ముని గిపోకుండా పట్టుకున్నాడు. గ్రామస్థుల సహాయంతో వృద్ధురాలిని తాళ్లతో బయటకి తీశారు. కుటుంబ సభ్యులను వివరణ కోరగా కొంతకాలంగా వృద్ధు రాలి మానసిక స్థితి బాగా లేదని తెలిపారు. 108 సిబ్బంది వృద్ధురాలిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను గ్రామస్థులు అభినందించారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

- 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్ల కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

- విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి
- హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

- సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బంది పైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

- ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం
- కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం
- కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం
- ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

- చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి
- వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

వైభవంగా రాజరాజేశ్వరస్వామి రథోత్సవం



శ్రీస్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

వేములవాడ, మార్చి 20: వేములవాడ రాజరాజేశ్వరక్షేత్రంలో పార్వతీ రాజరాజేశ్వరస్వా మి వారల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామివారి దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న శివకల్యాణోత్సవంలో భాగంగా నాలుగోరోజు శనివారం సాయంత్రం ప్రధాన ఘట్టమైన స్వామివారల రథోత్సవాన్ని అశేష భక్తజనం మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై దర్శనమిచ్చిన స్వామివారలను దర్శించుకున్నారు. రంగు రంగులపూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన రథాలపై పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు రథ ప్రతిష్ఠ, రథహోమం, రథబలి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య పట్టణ వీధుల మీదుగా రథోత్సవం నిర్వహించగా, స్థానిక మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవం సందర్భంగా స్థానిక యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఘనంగా యోగ నారసింహుడి ఏకాంతోత్సవం



స్వామివారల ఏకాంతోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

ధర్మపురి, మార్చి 30: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి వేళలో ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో వేంకటేశ్వర స్వామి వారల పుష్పయాగం కూడ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి 30: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయలో 2024-25లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పంకజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమై ఏప్రిల్ 15న ముగిస్తుందని తెలిపారు. 1-4-2024 నాటికి 6 నుంచి 8ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. కాగా బాలవాటికా- 1,2,3లో ప్రవేశాలకు 1 నుంచి ఏప్రిల్ 15 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మార్చి 31 నాటికి 6 ఏళ్ల లోపు వారు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గంజాయి పట్టివేత

హుజూరాబాద్, మార్చి 30: హుజూరాబాద్ పట్టణంలోని డిపో క్రాస్ వద్ద ఓ బాలుడి వద్ద గంజాయిని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ బాలుడి వద్ద గంజాయిని పట్టుకొని బంధువుల సమక్షంలో విచారించి పంచనామా చేశామన్నారు. మైనర్ బాలుడి నుంచి ఒక కిలో 72గ్రాముల గంజాయిని సీజ్ చేసి డీపీవో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ వద్ద బంధువుల సమక్షంలో హాజరు పరిచామని సీఐ రమేశ్ తెలిపారు.

రైతుల రాస్తారోకో

- వరదకాలువకు నీరు విడుదల చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యే గేట్లు ఎత్తివేయించడంతో ఆందోళన విరమణ



రైతులను సముదాయిస్తున్న ఎస్సై

కథలాపూర్, మార్చి 30: వందలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని వెంటనే వరద కాలువ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దుంపెట శివారులో వరద కాలువపై రాస్తారోకో నిర్వహించారు. మేడిపల్లి, కథలాపూర్, భీమారం మండలాలకు చెందిన సుమారు వంద మంది రైతులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ప్రస్తుతం వరి పంటలు చేతికొచ్చే దశలో ఉన్నందు వల్ల నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ప్రజాప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు రైతులను కీలక సమయంలో ఆదుకోవాలని పేర్కొన్నారు. కథలాపూర్‌లోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అక్కడికి చేరుకుని జగ్గాసాగర్ వద్ద గేట్లు తెరిపించామని నీరు వస్తుందని చెప్పారు. అయినా నీరు వచ్చేదాకా ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు భీష్మించుకుని కూర్చుండడంతో వేములవాడ - కోరుట్ల రహదారిపై బస్సులు, జీపులు, ద్విచక్ర వాహనాలు గంట సేపు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జగ్గాసాగర్ వద్ద నీటిని విడుదల చేసిన విషయం ఎస్సై నవీన్ రైతులకు వివరించడంతో రైతాంగం ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిడుగు ఆనం దరెడ్డి, తేలు రాజేందర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్ బార్డర్‌లో ఆర్మీ జవాన్ మృతి



రామకృష్ణ(ఫైల్)

సైదాపూర్, మార్చి 30: సైదాపూర్ మండలం గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి రామకృష్ణ(27) అనే ఆర్మీ జవాన్ పాకిస్థాన్ బార్డర్‌లో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి-స్వరూపల కుమారుడు రామకృష్ణకు మూడేళ్ల క్రితం ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం వచ్చింది. కాగా జమ్ము కశ్మీర్‌లోని ఇండియా- పాకిస్థాన్ బార్డర్‌లో జేడీ(జనరల్ డ్యూటీ)గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం రామకృష్ణ మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. తమ కుమారుడు మృతి చెందడంతో తల్లి తండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రామకృష్ణ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని అక్కడి అధికారులు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు చెప్పినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. రామకృష్ణ మృతికి కారణాలు తెలియ రాలేదు. మృత దేహం గ్రామానికి చేరుకుంటే పూర్తి వివరాలు తెలిసే అవకాశముందని చెబుతున్నారు. కాగా ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ మృతికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాతృ భూమి రక్షణకు సైన్యంలో చేరిన రామకృష్ణ పాకిస్థాన్ బార్డర్‌లో మృతి చెందడం బాధాకరమని తెలిపారు. రామకృష్ణ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.

బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం రూ 30,64,396



ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహుడి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, మార్చి 30: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు శనివారం నిర్వహించగా రూ 30,64,396 ఆదాయం లభించింది. 14 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 57 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 7 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో ఘనంగా రుద్రయాగం

వేములవాడ, మార్చి 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం రుద్రయాగం ఘనంగా నిర్వహించారు. శివకల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు తీర్థరాజ పూజ, శ్రీస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు, అభిషేకములు, పారాయణాలు నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్ర కలశ స్థాపనము అనంతరం రుద్రయాగం నిర్వహించారు. తదుపరి శ్రీశివపురాణ ప్రవచనం, ఔపాసనం అనంతరం వీరశైవ జంగమ అర్చకులు బలిహరణము గావించారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణమండపంలో శృంగార వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం



మహమ్మద్ రియాజ్‌ను సన్మానిస్తున్న నూర్ బాషా సంఘం నాయకులు

గణేశ్‌నగర్/జమ్మికుంట, మార్చి 30: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకమైన మహమ్మద్ రియాజ్‌ను శనివారం తెలంగాణ రాష్ట్ర నూర్ బాషా సంఘం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్ తదితరులు హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా దూదేకుల నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించాలని మహ్మద్ రియాజ్‌కు వారు విన్నవించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నూర్ బాషా సంఘం నాయకులు మహ్మద్ అమన్, రియాజ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడికి ఘన నివాళి



సయ్యద్ అఖిల్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

గణేశ్‌నగర్, మార్చి 30: గుండెపోటుతో అకాల మరణం చెందిన కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ పార్థివ దేహానికి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం సయ్యద్ అఖిల్ కృషి చేశారన్నారు. ఆయన అకాల మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన సంతాపాన్ని తెలియజేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు రహమతు హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

భగత్‌నగర్, మార్చి 30: భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని శనివారం సీపీఐ నాయకులు అదనపు కలెక్టర్ కె లక్ష్మికిరణ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ మాట్లాడుతూ సీతారాంపూర్‌లోని సర్వే నంబర్ 16లోని 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, బ్రాహ్మండ్లపల్లి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలకు సన్మానం

కరీంనగర్ క్రైం, మార్చి 30 : కమిషనరేట్‌లో ఏఎస్ఐగా పనిచేసి పదవీ విరమణ పొందిన నలుగురు ఏఎస్ఐలకు శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏఎస్ఐలు ఎండ ఈనూరుద్దీన్(ఎస్‌బి) ఎండీ బషీరొద్దీన్(మానకొండూర్), సయ్యద్ మొయినొద్దీన్(ఏఆర్), పి చంద్రారెడ్డి(హుజూరాబాద్)లు పదవీ విరమణ పొందగా వారికి కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ అభిషేక్ మొహంతి సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లక్ష్మినారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామయ్య, ఆర్ఐలు శ్రీధర్‌రెడ్డి, సురేష్, కరీంనగర్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు, ఎస్ఐ సురేందర్ పాల్గొన్నారు.

పారమిత పాఠశాల వార్షికోత్సవం

కరీంనగర్ టౌన్, మార్చి 30: నగరంలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో 'ఆనంద' అనే పేరుతో వార్షికోత్సవం నిర్వహించారు. శనివారం వేడుకలను పారమిత అధినేత ప్రసాదరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పారమిత డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోద్‌రావు, రాకేశ్, ప్రసాద్, ప్రాచీ, వియుఎం ప్రసాద్, హన్మంతరావు పాల్గొన్నారు.

మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

సుభాష్‌నగర్, మార్చి 30: మాదిగలకు రెండు ఎంపీ టికెట్లు కేటాయించాలని ఎంఆర్‌పీఎస్-టీఎస్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపించర రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు మధు, ప్రధాన కార్యదర్శి జి వెంకన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

శంకరపట్నం, మార్చి 30: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి కె దేవేందర్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్పెషలాఫీసర్ దేవేందర్ రావు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శు లతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ జోగినపల్లి అనుపమరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జమ్మికుంట, మార్చి 30: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బాల వికాస ప్రోగ్రాం ఆఫీసర్ లత అన్నారు. జమ్మికుంటలో బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 15మంది మహిళలకు 21రోజులుగా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, బాల వికాస కో-ఆర్డినేటర్లు సుమలత, శిరీష, శిక్షకురాలు లావణ్య పాల్గొన్నారు.

ప్రేమ వివాహం చేసుకున్న జంటపై దాడికి యత్నం

గన్నేరువరం, మార్చి 30: మండల కేంద్రంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంటపై అమ్మాయి తరపు బంధువులు శనివారం దాడికి యత్నించారు. మండల కేంద్రానికి చెందిన ఇక్కుర్తి కిరణ్(28) అదే గ్రామానికి చెందిన యువతి(23) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో శనివారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేం ద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పెళ్లి చేసుకొని గన్నేరువరం పోలీస్‌స్టేష న్‌ను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న అమ్మాయి కుటుంబసభ్యులు, బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అబ్బాయిపై దాడికి ప్రయత్నించారు. ఎస్సై నరేష్ సిబ్బందితో వారిని వారించి చెదరగొట్టి కౌన్సెలింగ్ నిర్వహించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 30: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 9 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒకరికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు జైలు శిక్షతో పాటు మొత్తం 4 వేల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. మిగతా ఏడుగురికి 10,500 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

కాలువలు ఇలా..సాగునీరు అందేదెలా



డీబీఎం-3 ఉపకాల్వలో మొలిచిన గడ్డి

మానకొండూర్, మార్చి 30: మండలంలోని డీబీఎం-3 ఉప కాల్వలో గడ్డి మొలకెత్తడంతో నీరు సాఫీగా వెళ్లక చివరి ఆయకట్టుకు అందడం లేదు. ఎల్ఎండీ నుంచి కాకతీయ కాల్వ ద్వారా మండలంలోని డిబీఎం 2 ఉప కాల్వ, డీబీఎం 7 ఉపకాల్వల ద్వారా పలు గ్రామాల్లో వరి పంటకు సాగు నీరు సరఫరా అవుతుంది. మండలంలోని కాకతీయ కాల్వ ముంజంపల్లి నుంచి మానకొండూర్ మీదుగా లింగాపూర్ వరకు సాగు నీరు వెళ్లే డీబీఎం 3 ఉపకాల్వలో గడ్డి, తుంగ మొలిచింది. దీంతో నీరు సాఫీగా వెళ్లక చివరి పొలాలు ఎండిపోయే దుస్థితి నెలకొంది. ఎస్సారెస్పీ అధికారులు స్పందించి కాల్వలలో మొలిచిన గడ్డి, తుంగను తొలగించి పంటలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

'ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, మార్చి30: ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. బీఆర్ఎస్‌లో పదవులను అనుభవించి పార్టీ అధికారం కోల్పోగానే కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరిన కే.కేశవరావు, కడియం శ్రీహరి తీరును ప్రజల గమనిస్తున్నారన్నారు. శనివారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మీడియా సమావేశంలో రవిశంకర్ మాట్లాడారు. కే.కేశవరావు, కడియం శ్రీహరి తెలంగాణ ద్రోహులుగా మిగులుతారని ఫైర్ అయ్యారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎంపీ అభ్యర్థుల కొరత ఉందని, అందుకే బీఆర్ఎస్ నేతలను ఆశజూపి వారి పార్టీలో చేర్చుకొని టికెట్లు ఇస్తున్నారని విమర్శించారు. నాలుగు నెలలు కాక ముందే కాంగ్రెస్ ప్రభుత్వ మేమిటో ప్రజలకు అర్థమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోగా ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, బీఆర్ ఎస్‌ను ఓడించి తప్పుచేశామని ప్రజలు బాధపడు తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబునాయుడు శిష్యుడేనని, తెలంగాణను ఆంధ్రలో కలిపేందుకు బాబు కుట్రలో భాగంగానే రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి చేర్చుకునేందుకు గేట్లు తెరచామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు తాగు, సాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రిగా నీటి గేట్లను తెరచి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరతో పాటు 500 బోనస్ ఇవ్వాలని లేనిపక్షంలో గ్రామాల్లోకి రైతులు, ప్రజలు కాంగ్రెస్ నాయకులను రానివ్వరని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కరీంనగర్ కల్చరల్, మార్చి 30: గుడ్ ఫ్రైడే ఈస్టర్‌ను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల, అంధుల హాస్టల్‌లో పండ్లు, బ్రెడ్స్, కోడిగుడ్లను పంపిణీ చేశారు. శనివారం కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, బొబ్బిలి విక్టర్, పాస్టర్ జి.దయాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, సమ్యూల్, అమిత్‌కుమార్, శివకుమార్, సొల్లువర్ ఆనంద్, పాస్టర్ రాజు, పాస్టర్ ఎమనుయోల్ పాల్గొన్నారు.

● రన్ ఫర్ జీసస్ ఈస్టర్ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటినరీ వెస్లీ చర్చి, వెస్లీ కతిడ్రల్ సెంట్ మార్క్ చర్చి పాస్టర్ల సమూహంతో రన్ ఫర్ జీసస్‌ను ఉదయం 7 గంటలకు కోర్టు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి వెస్లీ చర్చి వరకు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కతిడ్రల్ చైర్మన్ పాల్కొమాల్, స్థానిక సంఘాల పాస్టర్లు ఎల్ఎండీ చర్చ్ కొత్తపల్లి చర్చ్ స్థానిక సంఘాల పాస్టర్లు ఎస్.జాన్, రాములు, ఇమ్మానియెల్, ఎలీషా, డేవిడ్ రాజ్, కృష్ణవర్, సురేశ్, చంద్రరావు, సత్యం, దేవదాస్, విల్సన్ సంజయ్, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వింధ్యావాలి విద్యార్థులకు పురస్కారం



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్

కరీంనగర్ కల్చరల్, మార్చి30: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్‌లో గల వింధ్యావాలి పాఠశాల విద్యార్థులు నాట్యమయూరి కళా పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో కీర్తి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణ సరస్వతి భవన్ నిర్వహించిన సాంస్కృతిక కూచిపూడి నాట్య ప్రదర్శనలో విద్యార్థినిలు బి.నిహారిక(7వ తరగతి), టి.అన్విత్రశ్రీ(3వ తరగతి) నాట్యమయూరి కళా పురస్కారాన్ని అందుకున్నారు. వీరిని పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ అభినందించారు.

బావుపేటలో కేంద్ర బలగాల కవాతు

కరీంనగర్ క్రైం, మార్చి 30 : కొత్తపల్లి మండలం బావుపేటలో సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు కవాతును నిర్వహించాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా కేంద్ర బలగాలు కవాతును నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతపై భరోసా కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగా శనివారం బావుపేటలో కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో లక్షా 8 వేల నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 30: కరీంనగర్ రెండో టౌన్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీలలో లక్షా 8 వేల నగదు పట్టుబడింది. కరీంనగర్ శివారులోని విద్యానగర్ శాతవాహన విశ్వ విద్యాలయం వద్ద రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టగా ఒక కారులోని బ్యాగ్‌లో లక్షా 8వేల నగదు పట్టుబడిందని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని అసురాంకు చెందిన నగదుగా నిర్ధారించి సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన నగదును బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తామన్నారు. నగదుకు సంబంధించిన సరైన వివరాలు లేనందున సీజ్ చేశామని, వారం రోజులలో సరైనా ఆధారాలు నోడల్ ఆఫీసర్‌కు చూపిస్తే నగదును యజమానికి అప్పగించనున్నారు. లేనిపక్షంలో ఆదాయపన్నుశాఖ అధికారులకు అప్పగిస్తారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

-ఎస్‌యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్‌వీ శ్రీరంగ ప్రసాద్
-వాణినికేతన్ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

గణేశ్‌నగర్, మార్చి 30: క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎస్‌యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ అన్నారు. శనివారం వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల 30వ వార్షికోత్సవాన్ని 2కె24 పేరుతో టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎస్‌వీ శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ తాను చదివిన కళాశాలకే అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. వాణినికేతన్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ ఐ.దీపిక మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాణినికేతన్ విద్యాసంస్థల ఎంబీఏ డైరెక్టర్ డాక్టర్ డి.వెంకట్‌రావు, వాణినికేతన్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్.ప్రశాంత్ రావులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. జీవితంలో ఈజీగా స్థిరపడలేమని, పట్టుదలతో అనుకున్నవి సాధించాలన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులు వాణినికేతన్ విద్యాసమితి చైర్మన్ సిహెచ్.విజయ, వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'బీసీల అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం కృషి'

భగత్‌నగర్, మార్చి 30: బీసీల అభ్యున్నతి కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆఫీస్ ఇన్‌చార్జి దేశభక్తుల సుధ అన్నారు. శనివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ ముఖ్య నేతల సమావేశం అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలన్నారు. అన్ని రంగాలలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. బీసీ సామాజిక వర్గాలకు న్యాయం చేయాలనే ఆలోచనతో మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీసీలకు చట్ట సభల్లో గౌరవం, సముచిత స్థానం కల్పిస్తు బీసీలకు అండగాఉంటుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక బీసీ కమిషన్ రాజ్యాంగ సంస్థగా ఏర్పాటయిందన్నారు. కేంద్ర కెబినెట్‌లో 34.2 శాతం మంది బీసీ మంత్రులను చేసిన ఘనత బీజేపీదేనన్నారు. బీసీ ముసుగు వేసుకుని అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయన్నారు. సమావేశంలో ఎడమ సత్యనారాయణరెడ్డి, మల్లికార్జున్, వందల రవి, గోపాల్, చంద్రగిరి వేణు, కందుల శ్రావణ్, కొత్తకొండ హరీష్, దమ్మయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు

- మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి సమక్షంలో చేరికలు



దేశిని స్వప్న-కోటిలకు పార్టీ కండువా వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్, మార్చి 30: హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లోకి వలసలు జోరులు కొనసాగుతున్నాయి. వారం రోజుల క్రితం కమలాపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో పాటు హుజూరాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కె శ్రీనివాస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, బీజేపీకి చెందిన హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామ మాజీ సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్, ఇల్లందకుంట మండలానికి చెందిన వారు శనివారం హైద్రాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు పార్టీలో చేరుతుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇద్దరు ఎంపీపీలు మూడు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. . మూడు రోజుల క్రితం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్య కార్యకర్తలను పిలిపించుకొని పార్టీని వీడవద్దని కోరారు. అయినప్పటికీ వలసలు మాత్రం కొనసాగుతున్నాయి.

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ ఎస్సీ సెల్ కన్వీనర్ దొంత రమేష్, మాజీ జడ్పీటీసీ అర్కాల వీరేశలింగం, , కౌన్సిలర్లు బొంగోని వీరన్న, పొనగంటి సారం గం, దేశిని రాధా-సదానందం, ఎలగందుల స్వరూప-శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

శంకరపట్నం, మార్చి 30: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ అన్నారు. శనివారం శంకరపట్నం మండలం కేశవపట్నం ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో పాటు రూరల్ సీఐ వెంకట్ కొత్తగట్టులో ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల్లో భద్రతాభావం కలిగించేందుకే కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇల్లందకుంట, మార్చి 30: మండలంలోని టేకుర్తి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి టేకుర్తి గ్రామంలో బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు అనుమానంగా గ్రామంలో సంచరిస్తుండగా గ్రామస్థులు అడ్డుకొని ప్రశ్నించారు. ఎలాంటి సమాధానం రాకపోవ డంతో చిన్న పిల్లలను ఎత్తుకెళ్లేవాడనే అనుమానంతో కొందరు అతడిపై చేయి చేసుకున్నారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. ఈ విషయంపై ఎస్సై రాజకుమార్‌ను వివరణ కోరగా బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని చెప్పారు. అతడు ఇటుక బట్టీల్లో పని చేసే వ్యక్తిగా ఉన్నాడని, ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

రామడుగు, మార్చి 30: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎంపీపీ గైర్హాజరు కాగా 12 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో ఆర్డీవో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. ఈ తీర్మానంలో కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్రులు పాల్గొని మద్దతు ప్రకటించారు. మండలంలో 14 మంది ఎంపీటీసీలకు గాను వెలిచాల ఎంపీటీసీ రాజీనామా చేయడంతో 13 మంది ఎంపీటీసీలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిష్మతి కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న చైర్మన్ సాగర్‌రావు, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్, మార్చి 30: జ్యోతిష్మతి అటానమస్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఉత్సవ్-2024పేరుతో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఫెన్స్ రీ సెర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ గౌట్ ఆఫ్ ఇండియా(డీఆర్ఎంఎల్) మాజీ డైరెక్టర్ డాక్టర్ జి మధుసూదన్‌రెడ్డి, వరంగల్ చీఫ్ ఇన్వెస్టిగేటర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీసీ అకాడమీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) సీఎస్సీ విభాగం ప్రొఫెసర్ సుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజర య్యారు. జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం అతిథిలను సత్కారించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, అకాడమీ అడిట్ డీన్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి30: నగరంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. 11/ కెవి ఉజ్వల పార్క్ ఫీడర్ పరిధిలో ఎన్టీఆర్ విగ్రహం, హనుమాన్‌నగర్, ఉజ్వల పార్క్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆర్మీ జవాన్ మృతికి మంత్రి సంతాపం

కరీంనగర్ అర్బన్, మార్చి 30: సైదాపూర్ మండలం గొడిశ్యాలకు చెందిన ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ శనివారం దేశ సరిహద్దులో మృతి చెందగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని కోరారు.

కొత్తపల్లి మండల కాంగ్రెస్ సమావేశం

కరీంనగర్ రూరల్, మార్చి 30: కొత్తపల్లి మండల కాంగ్రెస్ నాయకుల సమావేశం శనివారం నగరంలోని జ్యోతినగర్‌లో అసెంబ్లీ ఇన్‌ఛార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహన చారి, కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల స్వామిగౌడ్, బ్లాక్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండలకిసాన్ సెల్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 30: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌లో ఈనెల 29 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న 42వ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎ మణిచరణ్, ఎ గణేశ్‌సాయి, ఎం వైష్ణవి ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముఫాజిల్ తెలిపారు. క్రీడాకారులను ఫెడరేషన్ ఆఫ్ ఇండియా షూటింగ్‌బాల్ ప్రధాన కార్యదర్శి రవిందర్‌సింగ్ తోమర్, రంజిత్ బినవి, శకీల్‌ఖాజి అభినందించారు.

భట్రాజు వివాహ పరిచయ వేదిక

సుభాష్‌నగర్, మార్చి 30: జిల్లా భట్రాజ్ సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. శనివారం నగరంలోని పద్మనగర్‌లో గల భట్రాజ్ సంఘ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వధూవరులు పాల్గొన్నారని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నమాదవుని పవనసుత రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక కో ఆర్డినేటర్ ఎర్రమరాజు బాపురాజు, రాష్ట్ర యువజన సంఘం అసోసియేట్ అధ్యక్షుడు బాస్కరుని విజయరఘురామరాజు, ప్రశాంత్‌రాజు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●గణేశ్‌నగర్ : జిల్లాలో నడుస్తున్న ప్రైవేట్ హాస్టల్స్‌లో మూమెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని డిమాండ్ చేశారు. జ్యోతినగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

●సుభాష్‌నగర్: కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ముదిరాజ్‌లకే ఇవ్వాలని ముదిరాజ్ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జీ పిట్టల భూమేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌ల జనాభా అధికంగా ఉందన్నారు. కరీంనగర్ స్థానం టికెట్‌ను తీన్మార్ మల్లన్నకు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతుందని, అతనికి కాకుండా స్థానిక ముదిరాజ్ వర్గానికి చెందిన వారికి టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కో కన్వీనర్లు చన్నిల వెంకన్న, కొలకాని ఎల్లయ్య కళ్యాణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: కాంగ్రెస్‌పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసి, 1700 కోట్ల పెనాల్టీ చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు జారీచేయడాన్ని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ రాజమల్లయ్య శనివారం ఒక ప్రకటనలో ఖండించారు.

●భగత్‌నగర్: ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించడంతో పాటు, ఫిబ్రవరి నెలలో అత్యధిక ఆదాయం తెచ్చిన ఉత్తమ కండక్టర్లకు ప్రగతి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ లక్కుమల్లేశం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ముగియడంతో శనివారం ఆలయంలో హుండీ లెక్కించారు. వారం రోజు ల్లో 16లక్షల 57వేల 284రూపాయల ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్, ఈవో వెంకన్న తెలిపారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఎడవల్లి కిషన్‌రెడ్డి సాగు చేస్తున్న మల్బరి తోటను శనివారం కరీంనగర్ లోని రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో 40 మంది డీలర్లు సందర్శించారు. ఎట్టి పురుగుల పెంపకం యానిట్ల మెలకవలు తెలుసుకున్నారు. రామడుగులోని రైతు తిరుపతి సాగు చేస్తున్న మామిడి, కూరగాయల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మమత పాల్గొన్నారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం పురుషుల పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడిగా వంగల రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం శంకరపట్నం పురుషుల పొదుపు సమితి 22వ వార్షిక సమావేశం అధ్యక్షుడు వంగల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమితి గణకుడు అంజయ్య వార్షిక నివేదికను చదివి సభ్యులకు వినిపించారు..

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటి ఆక్టివిట్ ప్రభాత్ బయో లిమెడ్ కంపెనీ ప్రతినిధులు శనివారం డాక్టర్ మౌనికకు వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఎం పోలాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని గంగారం గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్ర స్వామి ఆలయం కోసం శ్రీరామ బయోసీడ్స్ మేనేజర్ గోపికృష్ణ, ఆర్గనైజర్ ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి మూడు లక్షల రూ పాయలు ఆలయ కమిటీకి శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పింగిళి కోమల్‌రెడ్డి, ఎంపీటీ సీ కాసం వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వాసవీ క్లబ్ మండల కమిటీని సిల్వర్ కేసీజీఎఫ్ కటుకం హరీష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామిడి శ్రీధర్, జనరల్ సెక్రెటరిగా రమేష్, ట్రెజరర్‌గా రవీందర్‌ను ఎన్నుకున్నారు.

- మండలంలోని వల్భాపూర్‌లో సీఐఎస్ఎఫ్ బలగాలతో జమ్మికుంట టౌన్ సీఐ రవి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై తోట తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

● చొప్పదండి: జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు శనివారం సందర్శించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా విద్యార్థులకు పంటలు, ఆధునిక పనిముట్లు, వర్మికంపోస్ట్ తయారీపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● జమ్మికుంట: మండలంలోని శంభునిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న 9మందిని శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 50,700 నగదును స్వాధీనం చేసుకున్నటు తెలిపారు.